నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శుక్రవారం 31 జనవరి 2025 | ADILABAD NIRMAL



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన

# కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించాలి

- ఆదిలాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన

ఎదులాపురం, జనవరి 30 : కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించాలని ఆదిలాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. జాతీయ కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలోని ఖుర్షీద్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత మహాత్మాగాంధీ, శాస్త్రవేత్త హాన్సన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. గాంధీ వర్ధంతి సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సాధన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా నమోదవుతున్న కుష్ఠు రోగుల్లో దాదాపు 60 శాతం మన దేశంలోనే నమోదవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్, లెప్రసి ప్రోగ్రాం అధికారి గజానన, డీఐవో శ్రీనివాస్, వైద్యాధికారి అన్సారి, డీపీఎంవోలు వామన్‌రావు, రమేశ్, నిజాముద్దీన్, ప్రశాంత్ దేశ్‌పాండే పాల్గొన్నారు.

**నివారణకు కృషి చేయాలి : నిర్మల్ డీఎంహెచ్‌వో రాజేందర్**

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 30 : కుష్ఠు నివారణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని జిల్లా వైద్యాధికారి రాజేందర్ అన్నారు. జిల్లా వైద్య కళాశాలలో ప్రపంచ కుష్ఠు వ్యాధి నివారణ దినోత్సవం లెప్రా సొసైటీ, మ్యాన్ కైండ్ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకుముందు మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, డీపీఎంవో రాజేశ్వర్, లెప్రా సొసైటీ ఫిజియోథెరపిస్ట్ కిషన్‌రావు, ప్రొఫెసర్లు దరహాస, లెప్రా సిబ్బంది స్రవంతి, పల్లవి పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి

# కొనుగోలు కేంద్రాల్లోనే ఉత్పత్తులను విక్రయించాలి

- ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్యామలదేవి

ఎదులాపురం, జనవరి 30 : రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పంట ఉత్పత్తులను విక్రయించి మద్దతు ధర పొందాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. గురువారం మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. తొలి రైతును సత్కరించి తూకం వేశారు. ఈ సందర్భంగా శ్యామలదేవి మాట్లాడుతూ.. క్వింటాలు కందులకు ప్రభుత్వం రూ.7,550 ఇస్తుందన్నారు. రైతులు ప్రైవేట్ వ్యాపారులు, దళారులను నమ్మి మోసపోకుండా కేంద్రాల్లో విక్రయించాలని సూచించారు. మార్కెట్ యార్డుల్లో పంటను అమ్ముకుని మద్దతు ధర పొందాలని కోరారు. ఈ ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ గజానంద్, మార్కెట్ కార్యదర్శి మధుకర్, కేంద్రం ఇన్‌చార్జి పండరి తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఆదిలాబాద్ డీఈవో ప్రణీత

# ఒత్తిడికి గురికాకుండా చూడాలి..

- ఆదిలాబాద్ డీఈవో ప్రణీత

ఎదులాపురం, జనవరి 30 : పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఈవో ప్రణీత అన్నారు. విద్యా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి కేరీర్ కౌన్సెలింగ్, గైడెన్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం డైట్‌లో నిర్వహించిన శిక్షణకు తొలి రోజు డీఈవో పాల్గొని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. డైట్ వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించడంతోపాటు ఆత్మస్థైర్యం ఏ విధంగా పెంచాలో వివరించారు. యేటా పదో తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వాటిని తగ్గించాలనే లక్ష్యంతో శిక్షణ ఇస్తున్నామని డీఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు ఎలియా, ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

# అధికారుల ఒత్తిడి తట్టుకోలేకే ఆత్మహత్య

- నల్లబ్యాడ్జీలు ధరించి ఉద్యోగుల నిరసన



ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తున్న టీజీవో సంఘం అధ్యక్షుడు శివకుమార్, ఉద్యోగులు

ఎదులాపురం, జనవరి 30 : అధికారుల ఒత్తిడి తట్టుకోలేకే నిజామాబాద్ జిల్లాకు చెందిన యువ అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ సాయిచరణ్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయం ఎదుట తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్ సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాయిచరణ్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. టీజీవో అధ్యక్షుడు శివకుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# 420 హామీలు కాంగ్రెస్ మోసం బీఆర్ఎస్ నిరసన

## హస్తం హామీలు అమలు చేసేలా బుద్ధిని ప్రసాదించు మహాత్మా

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గాంధీజీ విగ్రహాలకు గులాబీ శ్రేణుల వినతులు
- సీఎం రేవంత్ సర్కారు వైఫల్యాలపై ఫైర్..



నేరడిగొండలో గాంధీ విగ్రహానికి మెమొరాండం అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్, బీఆర్ఎస్ నాయకులు



కడెం మండల కేంద్రంలో..



భైంసా మండలంలో..



ఖానాపూర్ మండలంలో..

మంచిర్యాల ప్రతినిధి/ఆదిలాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : 'కాంగ్రెస్.. ఎన్నికలకు ముందు 420 హామీలిచ్చింది. అధికారంలోకి వచ్చి 420 రోజులైనా వాటిని అమలు చేయడం లేదు. ఓ మహాత్మా.. ప్రజలను నమ్మించి మోసం చేసిన ఈ అసమర్థ ప్రభుత్వం కళ్లు తెరిపించు. ఈ దద్దమ్మ పార్టీకి దారి చూపించు.. హామీలు నెరవేర్చేలా బుద్ధిని ప్రసాదించు' అంటూ బీఆర్ఎస్ నాయకులు గురువారం జాతిపిత గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు వినతి పత్రాలు అందించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. అలవికాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలోకి తొక్కిందని విమర్శించారు. కల్యాణ లక్ష్మి.. తులం బంగారం, రూ.4వేల పింఛన్, రూ.15 వేల రైతు భరోసా ఇలా.. ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదన్నారు. ఏ ఊరికి వెళ్లినా రైతులు రుణమాఫీ కాలేదనే చెబుతున్నారన్నారు. రైతులందరికీ రైతు భరోసా ఇవ్వకుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎన్నికల షెడ్యూల్ వస్తుందని తెలిసే, కేవలం ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే జనవరి 26న పథకాలు ప్రారంభించారని, ఇప్పుడు ఎన్నికల కోడ్ వచ్చినందుకే పథకాలు ఆగిపోయాయని ప్రచారం చేస్తూ ఓట్లు దండుకోవడానికి, మరోసారి ప్రజలను మోసం చేయడానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ఏడాది అసమర్థ పాలనను నిరసిస్తూ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు వినతి పత్రాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేసినా.. ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వినతిపత్రం అందజేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్‌లో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బెల్లంపల్లిలోని పాత జీఎం కార్యాలయ మూలమలుపు వద్ద మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, చెన్నూర్ పట్టణంలోని గాంధీ చౌక్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు, నిర్మల్‌లో నియోజకవర్గ సమన్వయకర్త రాంకిషన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు ఇచ్చారు.



నార్నూర్ మండలంలో..



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో..



నిర్మల్ అర్బన్ : గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ సమన్వయ కర్త రాంకిషన్ రెడ్డి



పెర్సపేన్ దేవతకు పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు



గోవాడ్‌లో ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలం

# పెర్సపేన్, బాన్ దేవతలకు పూజలు

ఇంద్రవెల్లి, జనవరి 30 : నాగోబా జాతరకు మూడో రోజైన మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో పెర్సపేన్ దేవతకు డోల్, సన్నాయి, కాలికోమ్ వాయిస్తూ మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ పటేల్‌తోపాటు మెస్రం వంశీయుల పటేళ్లు చిన్ను పటేల్, బాజీరావ్ పటేల్ ఆధ్వర్యంలో కోసు కటోడ, కటోడ కోసేరావ్, కటోడ హనుమంత్‌రావ్‌లు ప్రత్యేక పూజలు చేశారు. గంగాజలంతో జలాభిషేకం చేసి నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నవధాన్యాలతో కూడిన నైవేద్యాలను పెర్సపేన్ దేవతకు సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం బాన్ దేవతలకు పూజలు చేశారు. గోవాడ్‌లోని మహిళలతోపాటు బేటింగ్ చేసిన కొత్తకోడళ్లను వాయిద్యాలు వాయిస్తూ గోవాడ్ నుంచి సతీదేవతల ఆలయానికి తీసుకొచ్చారు. కొత్తకోడళ్లు కోనేరు నుంచి మట్టికుండలతోపాటు మరికొందరు బిందెలతో తీసుకొచ్చి బురదమట్టి చేసి బాన్‌దేవతలను తయారు చేశారు. ఏడు వరుసలతో కూడిన బౌలదేవతను తయారు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తకోడళ్లకు నాగోబా చరిత్రపై అవగాహన కల్పించారు.

**జాతరను పరిశీలించిన ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

నాగోబా జాతరలోపాటు మెస్రం వంశీయుల సంప్రదాయ ప్రత్యేక పూజలు, గోవాడ్‌లో మహిళల సంప్రదాయ పూజలు, సామూహిక వంటలను కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌష్ ఆలంతో కలిసి పరిశీలించారు. గోవాడ్‌లో మహిళలు తయారు చేసిన జొన్న గట్కా లడ్డులను పరిశీలించారు. మెస్రం వంశీయుల సంస్కృతి సంప్రదాయాలను మెస్రం వంశీయుల పెద్దలు వివరించారు. నేడు ప్రజా దర్బార్‌ను నిర్వహించనున్నారు. ఇందులో ఐటీడీఏ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి గిరిజనుల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తున్నారు.

# శుభకార్యానికి వెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం
- అతివేగంగా ప్రయాణిస్తున్న టీవీఎస్‌ను ఢీకొట్టిన కారు
- తీవ్ర గాయాలు కావడంతో దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి



పోసాని,సాయన్న(ఫైల్)

సోన్, జనవరి 30 : సోన్ మండలంలోని పాక్‌పట్ల గ్రామానికి చెందిన మరిపెద్ది సాయన్న(56), పోసాని(50) దంపతులు ఇద్దరు టీవీఎస్ ద్విచక్ర వాహనంపై నిజామాబాద్ జిల్లా మెండోరా మండలంలోని దూదిగాం గ్రామానికి గురువారం మధ్యాహ్నం శుభకార్యానికి బయలుదేరారు. మాదాపూర్ ఎక్స్‌రోడ్డు వద్దకు రాగానే నిర్మల్ నుంచి ఆర్మూర్ వైపునకు వెళ్తున్న కారు అతివేగంగా వీరు ప్రయాణస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఇద్దరికి తీవ్రగాయలు కావడంతో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సాయన్న మృతి చెందినట్లు తెలిపారు. తీవ్ర గాయాలైన పోసానిని నిజామాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. దంపతులు శుభకార్యానికి వెళ్లి వస్తామని చెప్పి తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో కుటుంబసభ్యులు, బంధువులు రోదనలు మిన్నంటాయి. ఒకేసారి దంపతులు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

సోన్, జనవరి 30 : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణ, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టిన చర్యలపై అధికారులు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కడ్తాల్ గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు వాహనదారుల ఇబ్బందులను తొలగించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, ఆర్అండ్‌బీ ఈఈ అశోక్‌కుమార్, జాతీయ రహదారుల అధికారి ప్రసన్న, ఆర్టీవో దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

# ఐదు లక్షలు చోరీ

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 30 : నిర్మల్‌లో పట్టపగలు బ్యాంకు వద్ద ద్విచక్రవాహనం సైడ్ బాక్స్‌లో పెట్టిన రూ.5 లక్షలు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడి వివరాల ప్రకారం.. లక్ష్మణచాంద మండలంలోని వడ్యాల్‌కు చెందిన సిరిగె నరేశ్, తన అల్లుడు కల్యాణ్‌తో కలిసి గురువారం నిర్మల్ పట్టణంలోని యూనియన్ బ్యాంకులో రూ.5 లక్షలు డ్రా చేశారు. డ్రా చేసిన నగదును కల్యాణ్ బ్యాంకు వద్ద గల మయూరి హోటల్ సెల్లార్‌లో నిలిపిన ద్విచక్రవాహనం సైడ్ బాక్సులోని కవర్‌లో పెట్టాడు. ఇంతలో కల్యాణ్‌కు ఫోన్ రావడంతో ఫోన్ మాట్లాడేందుకు వెళ్లాడు. ఫోన్ మాట్లాడిన తర్వాత బైక్‌లోని బాక్స్ తెరచి చూడగా రూ. 5 లక్షలతోపాటు చెక్ బుక్ కనిపించలేదు. సీసీ ఫుటేజీని పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి నగదును చోరీ చేసినట్లు తేలింది. ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.